సంతలో గొర్రెలు, కోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి -అనంతగిరి:కాశీపట్నం వారపు సంతలో బుధవారం గొర్రెలు, మేకలు, కోళ్లకు గిరాకి ధర పలికింది. చుట్టుపక్కల గ్రామాల రైతులు సంతకు తరలివచ్చారు. దసరా పండగ సమీపిస్తున్న తరుణంలో మేకలు, కోళ్లను ప్రజలు ఎక్కువమంది కొనుగోలు చేస్తున్నారు. విశాఖ ,ఎస్ కోట, విజయనగరం, కొత్తవలస తదితర మైదాన ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. ఒక్కొక్క మేక, గొర్రె రూ.10 వేల నుండి 20వేల వరకు ధర పలికింది.

సంతలో గొర్రెలు, మేకలు

తుపానుకు నష్టపోయిన..

కాఫీ, మిరియాల రైతులను ఆదుకోవాలి

-ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతు సంఘం నేతలు చిన్నబాబు, లక్కు

ప్రజాశక్తి- అరకు లోయ :భారీ వర్షాలకు నష్టపోయిన కాఫీ, మిరియాల రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు, కాఫీ సంఘం జాతీయ నాయకులు లక్కు లు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల కాలంలో మన్యంలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయన్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతపల్లి, జీకే విధి మండలాల్లో ఎక్కువ మంది కాఫీ రైతులు కాఫీ తోటలపై ఆధారపడి జీవన ఉపాధి సాగిస్తున్నారని వారు అన్నారు. తుపాన్ కారణంగా కాఫీ తోటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. దీంతోపాటు అంతర్ పంట మిరియాలు కూడా నష్టపోయిందన్నారు. కాఫీ తోటలకు కూటమి ప్రభుత్వం ఒక హెక్టార్‌కు 35 వేలు ప్రకటించిందని, ఆ నష్టపరిహారం రైతులకు కనీసం తోట కంచే వేయడానికి కూడా సరిపోదన్నారు. కాఫీ తోటలు వేసుకోవాలంటే మళ్లీ ఐదు సంవత్సరాలు పడుతుందన్నారు. హెక్టార్ కు కాకుండా ఎకరాకు లక్ష రపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు కాఫీ విత్తనం, మిరియాలు సంబంధించి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాలు తగ్గి 10 రోజులు అవుతున్నా తోటలలో అధికారులు సర్వేలు నిర్వహించలేదన్నారు. తక్షణమే కాఫీ తోటల్లో సర్వే నిర్వహించి నష్టపరిహారం ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన కాఫీ రైతు సంఘం జిల్లా నాయకులు గురుమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన కాఫీ రైతు సంఘం నాయకులు

బహుమతులు చూపుతున్న విద్యార్థులు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : మండలంలోని అరుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023-2024 విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభను కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలకు బుధవారం అరుకులోని యూనిటీ ఫర్ ఛారిటీ ట్రస్టు డైరెక్టర్ నీలి నారాయణరావు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ముగ్గురు విద్యార్థినిలకు మెమొంటో లను అందజేసి అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. పాఠశాల స్థాయిలోనే ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాన్, పీఆర్‌టియూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గెన్ను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు లేక మూతపడ్డ పాఠశాల

ప్రజాశక్తి -అనంతగిరి:ఉపాధ్యాయుడు లేక నెలా 15 రోజులుగా చొట్టడవలస ప్రాథమిక పాఠశాల మూతపడింది. విద్యార్థులు పాఠశాలకు వెళుతున్నారు. టీచర్ రాక పోవడంతో తిరిగి రోజు ఇంటికి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఓలుగు కన్నయ్య మాట్లాడుతూ, కుందేలుగుడ్డి, కోటపర్తివలస, చొట్టడవలస గ్రామాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో పనిచేసే టీచర్ ఆగస్టు 15 నుండి ఈరోజు వరకు హాజరు కాలేదన్నారు. దీంతో విద్యార్థులకు చదువు అందలేదన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు టీచర్‌ను నియమించాలని కోరారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తీవ్ర నష్టాన్ని మిగిల్చిన భారీ వర్షాలు

- కొట్టుకుపోయిన పంట పొలాలు
- రహదారులు, తాగునీటి కుళాయిల అస్తవ్యస్తం
- గెడ్డ నీరు తాగుతున్న బంధవీధి గిరిజనులు
- నేటికీ గ్రామాన్ని సందర్శించని అధికారులు

వరదలకు పంట పొలాల్లోకి కొట్టుకొచ్చిన భారీ వృక్షాలు

ప్రజాశక్తి -సీలేరు

ఈనెల 8న అర్ధరాత్రి భారీ వర్షాల కారణంగా జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధ వీధి గ్రామంలో కొండచరియలు విరిగి పంట పొలాలు ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోయాయి. బండరాళ్లు పంట పొలాలపై గుట్టలుగా పేరుకుపోయి ఏ భూమి ఎవరిదో తెలియని దుస్థితి నెలకొంది. రహదారులు కోతకు గురై అస్తవ్యస్తంగా మారాయి. గ్రామంలో మంచినీటి కుళాయిలు పూర్తిగా దెబ్బతినడంతో వాగుల్లో పారే వరద నీటిని గిరిజనులు తాగాల్సిన దుస్థితి నెలకొంది. వాగుల్లో నీరు తాగడం వలన ప్రజలు రోగాలు బారిన పడే ప్రమాదం ఉంది. వరదలు వచ్చి పది రోజులైనా అధికారులెవరూ తమ గ్రామాన్ని సందర్శించకపోవడం, నష్టాన్ని అంచనా వేయకపోవడం విచారకరమని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పీవో అభిషేక్ స్పందించి తమ గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లింపునకు, మంచినీరు, రహదారి సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లూరి పార్కు కళావిహీనం

జికె.వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్ దారాలమ్మ అమ్మవారి దిగువ ప్రాంత ప్రమాదం మలుపు సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు పార్కు ఈ నెల 8న భారీ వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొండలపై నుంచి రాళ్ళు, చె త్తా చె దా రం అల్లూరిపార్కులోకి దొరులుకుంటూ రావడంతో పార్కు కళాహీనంగా మారిపోయింది. దారాలమ్మ ఆలయ పూజారి సాగిన నారాయణమూర్తి దారాలమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తుల వద్ద విరాళాల సేకరించి పార్కు సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు అనేక మంది పర్యాటకులు అల్లూరు పార్కును సందర్శించి పరిసర ప్రాంతాల అందాలని ఆస్వాదించేవారు. కార్తీక మాసంలో పిక్నిక్ స్పాట్ కావడంతో ఆ సమయంలో ఇక్కడ సందడిగా ఉంటుంది. జిల్లా అధికారులు వెంటనే స్పందించి అల్లూరు పార్కుకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని దారకొండ గ్రామానికి చెందిన గొర్ల గణేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

తాగడానికి వాగుల్లో ప్రవహిస్తున్న నీటిని సేకరిస్తున్న గిరిజనులు

వరద ప్రవాహం కొట్టుకొచ్చి పూర్తి ధ్వంసమైన అల్లూరి పార్కు

ఐక్యత ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- మోతుగూడెం

ఐక్య ఉద్యమాలు ద్వారానే కార్మికులు తమ సమస్యలను పరిష్కరించకలుగుతారని సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, చింతా రాంబాబు, డివి రమణ అన్నారు. అల్లూరి జిల్లా వై రామవరం మండలం, డొంకరాయి గ్రామంలో బుధవారం వరరత్నం అధ్యక్షతన డొంకరాయి గ్రామం బండగంటి పంచాయతీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అసంఘటితరంగ కార్మికులకు పనులు దొరకడం లేదని, పనులు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు పంచాయితీ స్థాయి కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చింత రాంబాబు, అధ్యక్షులుగా వరరత్నం (డేవిడ్), ప్రధాన కార్యదర్శిగా కిలో ముక్త, ఉపాధ్యక్షులుగా నాగ్ మంగళ్ దన్, శేషం మదన్, సహాయ కార్యదర్శులుగా పొంగి సురేష్, గమల శివ, ట్రెజరర్‌గా పొంగి లైకాన్, 28 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నేతలు సురేంద్ర, అప్పలనర్స, గంగరాజు, తదితరులు

దేశం గర్వించదగ్గ నాయకుడు ఏచూరి

సంతాప సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:భారతదేశం గర్వించదగ్గ మేధావి కమ్యూనిస్టు సిద్ధాంత వేత్త సీతారాం ఏచూరి అని, ఆయన మరణం దేశానికి, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర అన్నారు. అరకులోయ మండల కేంద్రంలోని అక్షయ ఇన్ ఫంక్షన్ హాల్ లో బుధవారం సిపిఎం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సంతాప సభకు సిపిఎం అరకులోయ మండల కార్యదర్శి కె రామారావు అధ్యక్షత వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కింద సురేంద్ర, అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ సంతాప సభను ఉద్దేశించి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ప్రత్యేక హోదా ఇస్తేనే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, పార్లమెంట్లో ఏచూరి తన గళాన్ని వినిపించాలన్నారు. ఏచూరి విద్యార్థి దశలోనే పలు పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అతి చిన్న వయసులోనే విద్యార్థి ఉద్యమాల బాటపట్టి దేశంలోనే అగ్రనేతగా ఎదిగిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీని దేశంలోనే లేకుండా చేయాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్న తరుణంలో ఏచూరి చనిపోవడం బాధాకరమన్నారు.బిజెపి అవలంబిస్తున్న మతోన్మాదాన్ని వ్యతిరేకించి అన్ని మతాలు దేశంలో కలిసికట్టుగా ఉండాలని పార్లమెంట్లో ప్రస్తావించారని గుర్తు చేశారు. ఉపాధి హామీ, అటవీ హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన చనిపోవడం కమ్యూనిస్టు పార్టీకి ప్రజా ఉద్యమానికి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగిస్తేనే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లని ఆయన చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ, సీతారం ఏచూరి చేసిన కృషి నేటి యువతరానికి ఆదర్శమన్నారు. దేశంలో బిజెపికి అడ్డుకట్ట వేసేందుకు వివిధ పార్టీలను ఐక్యం చేసి ఇండియా కూటమి ఏర్పాటులో కీలకపాత్ర పోషించాలని కొనియాడారు. ఏచూరి తన చివరి శ్వాస వరకు ప్రజా సమస్యలపై ఉద్యమం చేశారన్నారు.విభజన హామీలు అమలు చేయాలని సీతారాం ఏచూరి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వానికి నిలదీసారని చెప్పారు. ఏచూరి ఆశయ సాధన కోసం కృషి చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, బోనంగి చిన్నయ్య పడాల్, అనంతగిరి జెడ్పిటిసి దిసరి గంగరాజు, ఎస్‌బి పోతురాజు, బాలదేవ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సుజాత, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

ప్రజాశక్తి- పెదబయలు:మండల కేంద్రంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు అడ్డుకట్టవేయాలని ఆదివాసి గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు సన్నిబాబు, స్థానిక సీత గుంట పంచాయతీ ఎంపిటిసి బొంజుబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన చట్టాలు, హక్కులు ఉల్లంఘించి అక్రమంగా గిరిజనేతరులు నిర్మాణాలు చేపడుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. మొగలిపూరి రాధాకృష్ణ అక్రమంగా నిర్మించిన ఇల్లును కూల్చాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినాచట్టపరమైన చర్యలు తీసుకోలేదన్నారు.అక్రమ కట్టడాలను వెంటనే కూల్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పి భాస్కరరావు, జి రాధాకృష్ణ, జేఏసీ నాయకులు పోతురాజు, మాజీ ఎంపీపీ కొండయ్య, సీత గుంట వైస్ సర్పంచ్ గంగాధరం, నర్సింగరావు, రమేష్ పాల్గొన్నారు

నినాదాలు చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వరదలకు పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకూ నష్టపరిహారం చెల్లించాలి

నీట మునిగిన గృహాలకు విజయవాడ తరహాలో పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో రెండుసార్లు వరదలు ముంచెత్తడంతో పంటలు పూర్తిగా మునిగిపోయి వరి, మిర్చి, పొగాకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, బాధిత రైతులు ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. నీట మునిగిన ఇళ్లకు విజయవాడ తరహాలో నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. మండలంలోని రేఖపల్లిలో కామ్రేడ్ బొప్పెన భీమయ్య భవన్‌లో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన ఆ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశంలో పూనెం సత్యనారాయణ మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. ఒక వైపు నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా, మరోవైపు కాపర్ డ్యాం నిర్మించి ప్రతి ఏటా రెండు మూడు సార్లు వరదల్లో ప్రజలను, వారి ఇళ్లను, పంటలను ముంచుతూ తీవ్ర ఇబ్బందులకు, కష్టనష్టాలకు గురి చేస్తున్నాయని విమర్శించారు. నాట్లు వేసిన వరి పొలాలు పాడైపోయి, మిర్చి, పొగాకు నారుమడులు దెబ్బతిని రైతాంగం తీవ్ర నష్టంలో కూరుకుపోయిందని తెలిపారు. ఇటువంటి సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం మునిగిన పంటలకు నష్టపరిహారం ఇచ్చేది లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం పోలవరం ముంపు అనే సాకు చూపకుండా నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వరదలకు నీట మునిగి దెబ్బతిన్న ప్రతి గృహానికీ విజయవాడ తరహాలో నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున రైతులను, ప్రజలను కూడగట్టి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు, ఈ సమావేశంలో ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, వెట్టి లక్ష్మి, పూనెం సరోజిని, ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు సున్నం రాజులు, కారం సుందరయ్య, తోడం రాజు, కదల కొండారెడ్డి, వడ్లాది రమేష్, తుర్రం బాబురావు, సున్నం పార్వతి, పోడియం శ్రీరామ్మూర్తి, పులి బొజ్జి, కారం సత్తిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

హెచ్‌ఎంపై విచారణాధికారిగా సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం

గంగవరం మండలం గంగవరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రు రామకృష్ణపై విచారణ అధికారిగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని నియమించినట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. తన చాంబర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గంగవరం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన చంద్రు రామకృష్ణను ముందుగా ప్రాథమిక విచారణ జరిపి విధులనుండి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ అంశంపై రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని విచారణ చేసి 20 రోజుల్లో నివేదిక సమర్పించే విధంగా విచారణ అధికారిగా నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.

సంతల్లో నాణ్యమైన వస్తువులు విక్రయించాలి

చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

ప్రజాశక్తి-చింతూరు

వారపు సంతల్లో గిరిజనులకు నాణ్యమైన వస్తువులు విక్రయించాలని చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ అన్నారు. చింతూరులో గ్రామంలో బుధవారం జరిగే వారపు సంతను ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ముందుగా వ్యాపారులు ఏయే నిత్యవసర సరుకులు, ఏ రకమైన సామాగ్రి సంతలో విక్రయిస్తున్నారో పరిశీలించారు. అనంతరం పిఒ అపూర్వ భారత్ మాట్లాడుతూ ఈ సంతలో గిరిజనులకు విక్రయించే వస్తువులు నాణ్యత లేకపోతే తగు చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు. వారపు సంతలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం చింతూరు ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వివిధ రకాలైన వ్యాపారాలు చేయుటకు కొట్టు గదులు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేసే సమర్పించాలని సంబంధిత అధికారులను పిఒ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు సంతను సందర్శిస్తున్న ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

జలపాతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి విభీషేక్ ఆదేశించారు. బుధవారం కొత్తపల్లి జలపాతాన్ని ఆయన సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తపల్లి జలపాతాన్ని పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. కొత్తపల్లి జలపాతానికి ప్రధాని రహదారి నుండి నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అంతర్గత విద్యుదీకరణ పనులు, ప్లాంటేషన్, పెయింటింగ్ పనులను త్వరితగ తినపూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈ ఈ టి. కొండయ్య పడాల్, టూరిజం మేనేజర్ మురళి, జేఈ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాటుచేస్తున్న బోరు

కమ్యూనిటీ భవనంలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ బురిడీవలస గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో నూతనంగా మంజూరైన తాగునీటి బోరును బుధవారం స్థానిక సర్పంచ్ పి కొములు ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొములు మాట్లాడుతూ, గ్రామస్తులతో పాటు పంచాయతీ గిరిజనులందరికీ కమ్యూనిటీ భవనం ఉపయోగ పడుతుందన్నారు. అక్కడ వేడుక ఫంక్షన్లు, సమావేశాలుతో పాటు పలు రకాల కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగు తుందన్నారు. తాగునీటితో పాటు విద్యుత్ , మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కమ్యూనిటీ భవనాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజ్ కుమార్, నాయకులు మోహన్‌రావు పాల్గొన్నారు.

కైలాసగిరిపై విత్తన బంతులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ ఆధ్వర్యాన కైలాసగిరిపై విత్తనబంతులను జారవిడిచే కార్యక్రమాన్ని విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ కాలుష్యంతో పర్యావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయని, తద్వార భూతాపం విపరీతంగా పెరిగి ప్రకృతి వైపరీత్యాలు తరచు సంభవిస్తున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ ఒక మొక్కను విధిగా నాటాలన్నారు. మర్రి, రావి, జువ్వి, చింత, ఏనుగు గురువింద, దిరిసిన, పొగడ, నిద్ర గన్నేరు, గంగ రావి, బాదం, అడవి బాదం, ఫాల్స్ అశోక, అడవి చింత, వేప, కరక్కాయ, ఇండుగ, రేల, తురాయి, రామాఫలం, సీతాఫలం, వేప వంటి దాదాపు 35 రకాలైన వృక్షజాతులకు చెందిన విత్తనాలను మట్టితో చేసిన సుమారు 3000 బంతులను గ్రీన్ క్లైమేట్ పర్యవేక్షణలో కైలాసగిరి కొండపై వెదజల్లినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో దాట్ల కీర్తి, డిఎఫ్ఓ శాంతి స్వరూప్, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు రత్నం, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో పిసిఒఎస్ సమస్యపై అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశంలో చాలా మంది మహిళలను ప్రభావితం చేసే పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఒఎస్) గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ నెలలో అవేర్‌నెస్ నెలగా జరుపుకుంటారని ప్రముఖ న్యూట్రిసనిస్ట్ వెల్నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణమూర్తి తెలిపారు. సిరిపురంలోని వివాన్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో షీలా కృష్ణమూర్తి మాట్లాడుతూ, పీరియడ్స్ సరిగా రాకపోవటం, మగ హార్మోన్ల స్థాయిలు అధికంగా ఉండటం, అండాశయంలో తిత్తులు వంటి లక్షణాలతో కూడిన పిసిఓఎస్ కారణంగా బరువు పెరగడం, మొటిమలు, అవాంఛిత రోమాలు, సంతానోత్పత్తి సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. అవసరమైన పోషకాలను అందించే బాదం, ఆకు కూరలు, పప్పులు తృణధాన్యాలు వంటి సహజ ఆహారాలను తీసుకోవడం మంచిదని చెప్పారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పర్యాటక మండలి చైర్మన్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పర్యాటక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిన్న తరహ నుండి పెద్ద తరహ వరకు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి డిపిఆర్ తయారు చేయాలని, అందులో వచ్చే ఆదాయం, ఖర్చుల వివరాలు, రవాణా, ఆతిథ్యం, వసతి తదితర వివరాలు పొందుపరచాలని సూచించారు. అదేవిధంగా పర్యాటక రంగంలో అందులో గిరిజన సామాజిక వర్గాన్ని భాగస్వామ్యం చేయాలని, అడ్వంచర్ టూరిజం, ఎకో టూరిజం, రెస్పాన్సిబుల్ టూరిజం ఉండేలా చూడాలన్నారు. పర్యావరణానికి ఎటువంటి ముప్పు లేని విధంగా పర్యాటక అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక ప్రదేశాలలో ప్లాస్టిక్ పూర్తిగా నియంత్రించాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగు పరచాలని, పర్యాటకులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో టూరిజం కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యాటక రంగం అభివృద్ధితో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందన్నారు. స్వదేశ్ దర్శన్ పేరిట అరకు వేలీ నుండి పాడేరు మీదుగా లంబసింగి, పరిసర ప్రాంతాలకు టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కారవాన్ టూరిజం అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని, డుంబ్రిగుడ మండలం అంజోడ వద్ద 4.50 ఎకరాల స్థలంలో కారవాన్ పార్కింగ్, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు చేసి వారికి పర్యాటక రంగం పై అవగాహన పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో మండలి సభ్యులు, సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాస ఫాణి, జిల్లా టూరిజం అధికారి దాసు, జిల్లా పంచాయతి అధికారి కొండలరావు, జిల్లా అటవీ అధికారి వినోద్ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రశాంత్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డివిఆర్ఎం రాజు, వేణుగోపాల్, పంచాయతి రాజ్ ఇఇ కొండయ్య పడాల్, డిపిఆర్ఓ పి.గోవింద రాజులు, అడ్వంచర్ అసోశియేసన్ ప్రతినిధి జస్టిన్, స్వదేశ్ దర్శన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రతన్ రాజు, మ్యూజియం క్యూరేటర్ మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

మలేరియా నియంత్రణకు పటిష్ట చర్యలు

డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో మలేరియా నియంత్రణ కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ భాష వెల్లడించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మలేరియా ఉధృతి ఎక్కువగా ఉండే 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను హాట్స్పాట్గా గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం రుతుపవనాల ఆధారంగా అక్టోబర్ వరకు మలేరియా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుతం మలేరియాతోపాటు డెంగ్యూ జ్వరాలు కూడా అదుపులో ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 2534 మలేరియా కేసులు నమోదయ్యాయని, గత ఏడాది (2984) తో పోలిస్తే తక్కువని తెలిపారు. డెంగ్యూ కేసులు గతేడాది 114, ఈ ఏడాది 28 కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. జ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎంపిక చేసిన 1767 గ్రామాల్లో మొదటి రెండవ విడతల్లో ఏసీఎం పిచికారి నిర్వహించామన్నారు. సి ఎస్ ఆర్ నిధులతో 17 వేల దోమతెరలు కొనుగోలు చేసి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేశామని చెప్పారు. ఎన్ వి బి డి సి పి కింద ఐదు లక్షల 75 వేల మెడికేటెడ్ దోమతెరల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశామని చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేసిన వెంటనే జిల్లాలో ప్రతి కుటుంబానికి ఈ దోమతెరలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

అరకులోయలో స్వచ్ఛత హి ర్యాలీ

ప్రజాశక్తి-అరకులోయ:స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా బుధవారం అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు.డిగ్రీ కళాశాల నుంచి అరకులోయ టౌన్ షిప్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని నినాదాలు చేశారు. మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, పెదలబుడు మేజర్ పంచాయతీ ఈవో రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటిస్తేనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో వాతావరణం కలుషితం అవుతుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ సభ్యులు, అధ్యాపకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకొస్తాం

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకురావడం తన లక్ష్యమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. కలెక్టర్ విజయ్ కృష్ణణ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఆస్పత్రిలో రోగులకు సేవ చేయడం వైద్యులకు దేవుడిచ్చిన వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తన హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, లిఫ్ట్, మొబైల్ బ్లడ్ బ్యాంక్, ఆర్థోపెడిక్ ఎక్స్-రే, డయాలసిస్ యూనిట్ తదితర విషయాలపై ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించారు. ఐదు సంవత్సరాల కాలంలో ఆస్పత్రి నుంచి 6,000 మంది గర్భిణీ మహిళలను ప్రవేట్ హాస్పిటలకు పంపారని 2018లో నెలకు 500 డెలివరీలు జరిగేవి అని ఈ ఐదు సంవత్సరాల్లో ప్రసూతి డెలివరీలు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. పలు అంశాలు పై సూపరెంటెండెంట్ డాక్టర్ నీలవేణిని ప్రశ్నించారు. మూడు నెలలైనా కమిటీ వేయకపోవడంపై కూడా ఆరా తీశారు.ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మొబైల్ బ్లడ్ బ్యాంక్ ద్వారా గత ఐదు సంవత్సరాల కాలంలో ఎన్ని యూనిట్ల రక్తం సేకరించారన్నారు. ఆస్పత్రి సిబ్బంది డబ్బులు వసూలు ఆరోపణలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రైవేటు ఆంబులెన్స్ లకు ప్రత్యేక ధర నిర్ణయించాలని సూచించారు. ఆయుష్ హాస్పిటల్ పూర్తయి ఐదు సంవత్సరాలు అవుతున్నా నిరుపయోగంగా ఎందుకు ఉంచారన్నారు. హాస్పటల్లో శస్త్ర చికిత్స కు కావలసిన పరికరాలు, మరొక ఆర్వో వాటర్ ప్లాంట్ సమకూర్చుతానని స్పీకర్ తెలిపారు. కలెక్టర్ విజయ్ కృష్ణణ్ మాట్లాడుతూ, ఆస్పత్రికి కొత్త అంబులెన్స్ మంజూరు చేస్తామన్నారు. పాముకాటు కేసును ఎందుకు ప్రైవేటు ఆస్పత్రికి పంపారో విచారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డీసీహెచ్ ఎస్.శంకర్ ప్రసాద్, ఆర్డీవో జయరాం, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపాధ్యాయులు ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థులకు బోధన చేయాలని డిప్యూటీ డిఇఓ అప్పారావు సూచించారు. మండలంలోని వేంపాడు, చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. శిక్షణ తరగతులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు పాఠ్యాంశనైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి బోధనోపకరణాల ద్వారా ఆసక్తికరమైన బోధన చేయాలన్నారు. శిక్షణా తరగతులలో రిసోర్స్ పర్సన్ లు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని తరగతి గదిలో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. ఇంటరాక్టీవ్ ప్యానల్ బోర్డులను బోధనకు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు కె.నరేష్, వేమగిరి నూకరాజు ఉన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం

నక్కపల్లి మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని బుధవారం డిప్యూటీ డిఇఓ పి అప్పారావు పరిశీలించారు.ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయాలన్నారు .విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఆయన వెంట ఎంఈఓ వేమగిరి నూకరాజు, హెచ్ఎం ఉన్నారు .

ప్రతిభకు పదును పెట్టాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:విద్యార్థులు అవకాశము ఉన్నంతలో ప్రతి టాలెంట్ టెస్టులో పాల్గొని ప్రతిభకు పదును పెట్టాలని ఎంఈఓ రామారావు సూచించారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలో సాహసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ పట్ల విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి దీపక్ మాట్లాడుతూ, ఆరవ తరగతి నుంచి నుంచి 10 వరకు చదువుకుంటున్న పిల్లలకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి వారికి నగదు బహుమతి మొదటి ముగ్గురికి 10000, ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు. అదే విధంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ సంస్థ నుంచి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు లక్ష్మి, కాల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్సై రమేష్ సూచించారు. బుధవారం వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ తప్పక కలిగి ఉండాలన్నారు.

టీచర్స్ కాలనీలో పారిశుధ్య పనులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

చెత్తను ఎత్తి ట్రాక్టర్లో తరలిస్తున్న జెన్కో పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి -సీలేరు: జీకె వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న టీచర్స్ కాలనీలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కాలనీలో చెత్త కుండీ చుట్టూ వ్యర్ధ పదార్థాలు పేరుకుపోయి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని బుధవారం ప్రజాశక్తి ప్రచురించిన వార్తకు స్థానిక పంచాయతీ సర్పంచ్ దుర్గ స్పందించారు. కాలనీలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించే బాధ్యత అటు ఏపీ జెన్కో, ఇటు పంచాయతీ పైన ఉండడంతో ఏపీ జెన్కో పంపు స్టోరేజ్ ఏఈ సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఏఈ సురేష్ వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన టీచర్స్ కాలనీలో బుధవారం పారిశుధ్య పనులు ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులతో చేపట్టారు. అనంతరం చెత్త కుండీల్లో చెత్తను దూర ప్రదేశానికి డంప్ చేశారు. ఏఈ సురేష్‌కు, సర్పంచ్ దుర్గకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కో-కన్వీనర్‌గా రమేష్

ప్రజాశక్తి - తగరపువలస : ఏపీ పద్మశాలి సంఘం రాష్ట్ర కోకన్వీనర్‌గా జివిఎంసి ఒకటో జోన్ తగరపువలసకు చెందిన మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్ నియమితులయ్యారు. సంఘ పరంగాను, టిడిపిలోనూ గతంలో అనేక పదవులు నిర్వహించి, పేరు తెచ్చారు. సౌమ్యునిగా మంచి గుర్తింపు ఉంది. అఖిల భారత పద్మశాలి సంఘానికి అనుబంధంగా ఉన్న ఏపి సంఘంలో కోకన్వీనర్‌గా కీలక బాధ్యతలు అప్పగించారు. తనను ఈ పదవిలో నియమించిన సంఘం అఖిల భారత అధ్యక్షులు బి స్వామి, ప్రధాన కార్యదర్శి జగన్నాధం, కార్యదర్శి వి నరసింహం, రాష్ట్ర కన్వీనర్ జివి నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షులు బి పరమేష్ తదితరులకు రమేష్ ధన్యవాదాలు తెలిపారు. కాగా పద్మశాలి సంఘం రాష్ట్ర కోకన్వీనర్‌గా నియమితులైన రమేష్‌ను ఆయన నివాసానికి వచ్చిన టిడిపి వార్డు అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, మాజీ కౌన్సిలర్ చిలకా నరసింగరావు, పార్టీ నాయకులు గ దుతూరి శ్రీనివాసరావు, డి వెంకటేష్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

రేపటి నుంచి ఫిజిషియన్ల వార్షిక సదస్సు

ప్రజాశక్తి - ఆరిలోవ : సౌత్ జోనల్, సౌత్ మిడ్ జోనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సు ఈ నెల 20న విశాఖపట్నంలో ప్రారంభమౌతుందని ఆంధ్రప్రదేశ్ ఫిజిషియన్ల సంఘం అధ్యక్షులు, కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. బుధవారం విమ్స్ సమావేశ మందిరంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో సదస్సు జరుగుతుందన్నారు. సౌత్ జోన్ ఫిజిషియన్ల సదస్సు విశాఖలో జరగడం ఇదే మొదటిసారన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 60 మందికి పైగా ప్రముఖ వైద్యనిపుణులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కేరళ, కర్నాటక రాష్ట్రాలతో పాటు లక్షద్వీప్, పాండిచ్చేరి నుంచి సుమారు 1200 మంది వైద్యులు పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సదస్సులో వైద్యులు, వైద్య విద్యార్థులకు వైద్యరంగంలో వస్తున్న మార్పులు, నూతన పద్ధతులు తదితర అంశాలను వివరిస్తారన్నారు. ఈ సదస్సులో పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, అవార్డులు ప్రదానం చేయనున్నామన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ సదస్సులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయన్నారు. కార్యక్రమానికి సౌత్ జోన్ నుంచి ఏఐజి వైస్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సెంథిల్ రాజప్ప, బెంగుళూరుకు చెందిన ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సతీష్‌చంద్రతోపాటు నిపుణులైన వైద్యులు హాజరుకానున్నట్లు తెలిపారు.

పలుచోట్ల పిఎం జన్‌మన్ గ్రామసభలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ పరిధిలోని పూసివాడ గ్రామంలో బుధవారం పీఎం జన్‌మన్ గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పుల్లంగి పంచాయతీ సర్పంచ్ జార్జిబాబు, ఎంపిటిసి బున్నమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పివిటిజిలు నివసించే ప్రతి గ్రామానికీ తాగునీరు, రోడ్లు, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. మండలానికి సుమారు 680 గృహాలు మంజూరయ్యాయని, పుల్లంగి పంచాయతీకి సుమారు 70 పివిటిజి కుటుంబాలకు గృహాలు మంజూరైనట్లు చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూరుమామిడిలో...

మండలంలోని కుండాడ పంచాయతీ పరిధి మారుమూల గ్రామమైన తూరుమామిడి, కడుమూరు గ్రామాలకు బుధవారం సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన పివిటిజిల గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో ఎన్నో ఏళ్ళుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన రహదారి సమస్యగా గుర్తించి దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ గ్రామసభలో వైస్ ప్రెసిడెంట్ బి రామారావు, వార్డు మెంబర్ ఏ చిరంజీవిరెడ్డి, సచివాలయ సెక్రటరీ వి దుర్గాప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి సురేష్, డిజిటల్ అసిస్టెంట్ కే సురేష్ రెడ్డి, మహిళా పోలీస్ శ్వేత, టీచర్ పండయ్య, అంగన్వాడి టీచర్ బి చంద్రమ్మ, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి

ఎయు ఓషనోగ్రఫీ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు

జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభిస్తున్న ఎయు విసి శశిభూషణరావు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మెటీరియాలజి, ఓషనోగ్రఫీ విభాగం ప్రారంభించి 75 ఏళ్ల పూర్తి కావడంతో ప్లాటినం జూబ్లీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్‌లోని ఏయు కన్వెన్షన్ సెంటర్‌లో 'కరెంట్ ట్రెండ్స్ ఇన్ అట్మాస్పిరిక్ అండ్ ఓషియానిక్ ప్రాసెసస్ రిలేటెడ్ టు క్లైమేట్ చేంజ్ స్టడీస్' అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సును ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎయు మెటీరియాలజి, ఓషనోగ్రఫీ విభాగం దేశంలోనే ఇది మొదటి విభాగంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సొంతం చేసుకుందన్నారు. త్వరలో వందేళ్ల వేడుకకు సిద్ధమౌతున్న ఎయు, నాక్ గ్రేడింగ్‌లో ఏ ప్లస్ ప్లేస్ సాధించి దేశంలోనే అత్యుత్తమ మొదటి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఉందన్నారు ఎన్ఐఆర్ఎఫ్‌లోనూ మెరుగైన ర్యాకింగ్ సాధించిందన్నారు. ముఖ్య అతిధిగా న్యూఢిల్లీ మినిస్ట్రీ అఫ్ ఎర్త్ సైన్స్ సెక్రెటరీ డాక్టర్ఎం.రవిచంద్రన్ మాట్లాడుతూ దేశం లోనే మెటీరియాలజి, ఓషనోగ్రఫీ విభాగం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మొదటిసారిగా ఏర్పడిందన్నారు . పర్యావరణానికి, సముద్రానికి సంబంధించి ఇప్పటికే అనేక గొప్ప పరిశోధనలు చేపట్టినప్పటికీ, ప్రపంచ అవసరాలకు మరిన్ని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బెంగుళూరు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్డ్ స్టడీస్ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ శైలేష్ నాయక్ మాట్లాడుతూ ఎయు మెటీరియాలజి,ఓషనోగ్రఫీ విభాగానికి దేశంలోనే కాక ప్రపంచంలోనే ప్రత్యేకమైన స్థానం ఉందని, ఎందరో మేధావులను అందించిందన్నారు. ఆఫీస్ అఫ్ ప్రిన్సిపాల్ సైంటిఫిక్ అడ్వైజర్ సెక్రెటరీ డాక్టర్ .పార్విందర్ మైని మాట్లాడుతూ తాను మెటీరియాలజి,ఓషనోగ్రఫీ విభాగంలో పరిశోధన చేసి డాక్టరేట్ పొందానన్నారు. నూతన సవాళ్ళను అధిగమించేందుకు పరిశోధనలు నిరంతర ప్రక్రియగా సాగాలన్నారు . ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను డాక్టర్ ఎం.రవిచంద్రన్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఎయుమెటీరియాలజి,ఓషనోగ్రఫీ విభాగాధిపతి ఆచార్య పి.సునీత, ఎయు సైన్స్ కళాశాల ప్రినిపాల్ ఆచార్య ఎంవిఆర్.రాజు, ఐఎండి .డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.మోహ పాత్ర, ఎన్‌సిఎంఆర్‌డబ్ల్యుఎఫ్. హెడ్ డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, ఎన్‌పిఒఎల్ డైరెక్టర్ డాక్టర్ శేషగిరి, ఐఎన్‌సిఒఐఎస్ .డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ కుమార్, ఎన్‌సిసిఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎంవి.రమణమూర్తి,సిఎంఎల్ఆర్ఇ. డైరెక్టర్ డాక్టర్ జివిఎం.గుప్తా, విక్రమ సింహపురి యూనివర్సిటీ విసి ఆచార్య ఎస్‌వి.భాస్కర రావు మాట్లాడారు

సిఎం సహాయనిధికి రూ.కోటి విరాళం

ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందజేసిన గీతం యూనివర్సిటీ ఉద్యోగులు

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలో వరదలతో సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి గీతం విద్యాసంస్థల తరపున రూ.కోటి విరాళాన్ని గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎమ్.శ్రీభరత్ అందజేశారు. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన ఎమ్.శ్రీభరత్ గీతం ఉద్యోగుల ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందించారు. విజయవాడ వరద బాధితులకు 50 వేల ఆహర ప్యాకెట్లను గత నెలలో గీతం ద్వారా అందజేశారు. కాగా గీతం విద్యా సంస్థల ఉద్యోగస్తుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కాగా మరో రూ.కోటి వితరణను తెలంగాణా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించనున్నట్లు ఎమ్.శ్రీభరత్ వెల్లడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఎస్.అధికారి, గీతం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బిఆర్. మీనా పాల్గొన్నారు.

జిఓ 85 వ్యతిరేక ఆందోళనలో హిమబిందు

విజయవాడలో ఆందోళనలో పాల్గొన్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు: జీవో నెంబర్ 85కు వ్యతిరేకంగా విజయవాడలో వెయ్యి మందికి పైగా వైద్యాధికారులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో అల్లూరి జిల్లా, జికె.వీధి మండలం దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు. జీవో నెంబర్ 85 వ్యతిరేకంగా వైద్యుల పోరాటం కొనసాగుతుందని ఆమె తెలిపారు. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, ఇతర ముఖ్యమైన సమస్యలపై ప్రభుత్వం హామీ ఇవ్వకుండా నీరుగారిస్తే నిరసనలు ఆగవని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అనేక పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై కేంద్రం మొండివైఖరి వీడాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణలో కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఏమాత్రం మార్పులేదని, ఇపపటికైనా మొండివైఖరి వీడాలని ఎన్.రామారావు డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న 1315వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరంలో స్టీల్ సిఐటియు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లడుతూ, ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో రెండింటిని మూసేసి ఒకదానిని నడుపడం, 100 మంది అధికారులను నగర్‌నార్ స్టీల్ ప్లాంట్‌కు వెళ్లాలని విశాఖ స్టీల్ యాజమాన్యం సర్క్యులర్ విడుదల చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు సమకూర్చడంలో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందని, దీనికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని విమర్శించారు. మూడు రోజులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు కార్మికులను గందరగోళపరిచేలా ఉన్నాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన, దానికి అనుగుణంగా స్టీల్ యాజమాన్యానికిఆదేశాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీక్షాశిబిరంలో స్టీల్ సిఐటియు నాయకులు డిసిహెచ్ వెంకటేశ్వరరావు, యు.వెంకటేశ్వర్లు, నీలకంఠం, వి ప్రసాద్, రమణమూర్తి, కె సత్యనారాయణ, మధు, పట్టా రమేష్, సంజీవరావు, పిజికె.రాజు, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాస్, విళ్ళ రామ్మోహన్ కుమార్, శ్రీనివాస్ వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

సన్యాసిరావు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- గాజువాక: ఇటీవల మృతి చెందిన ప్రజానాట్యమండలి కళాకారుడు సన్యాసిరావు ఆశయసాధనకు కృషి చేయాలని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం గాజువాక సిఐటియు కార్యాలయంలో ప్రజానాట్యమండలి జోన్ కమిటీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన సన్యాసిరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతోపాటు ప్రజల్లో సామాజిక చైతన్యం తెచ్చేందుకు రెండు వేలకు పైగా పాటలు రాశారన్నారు. గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌కరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు అనేక పాటలు రాసి పాడారన్నారు. సంతాప సభలో పివైవి రమణారావు, సన్యాసిరావు, కుమారుడు స్టాలిన్, జి లక్ష్మి, పాపారావు, వై అరుణ, సరోజిని పాల్గొన్నారు.

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభను ఈనెల 19న గురువారం సాయంత్రం ఐదు గంటలకు, బిహెచ్‌పివి టౌన్‌షిప్ పోస్టాఫీస్ దగ్గర నిర్వహిస్తున్నట్లు, భెల్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్, నాయకులు ఎస్.జగన్నాథరావు తెలిపారు..